
## ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవంలో ఎమ్మెల్యే శంకర్

**షాద్‌నగర్, డిసెంబరు 15 ప్రభాతవార్త :** ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మేళ్లబాయి తండా ఆంజనే య స్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ సుగుణ రవి నాయక్, గ్రామస్థులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్ బాబర్, మండల పార్టీ అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్ గౌడ్, మాజీ ఎంపీపీ బుజ్జి బాబు నాయక్, నేతలు అగ్గనూరు బసవేశ్వర్, ఇబ్రహీం, చెంది తిరుపతిరెడ్డి, శ్రీనివాస్ యాదవ్, శ్రీను నాయక్, మంగ్యా నాయక్, ఆనంద్ నాయక్, తేజ నాయక్, దేశ్య నాయక్, కుమార్ నాయక్, వేణు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



శంకర్‌ను సన్మానిస్తున్న గ్రామస్థులు



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

## నీటిలో మునిగి యువకుడు గల్లంతు.. గాలిస్తున్న గజ ఈతగాళ్ళు

**ధారూరు, డిసెంబర్ 15, ప్రభాతవార్త:** నీటిలో మునిగి యువకుడు గల్లంతయిన సంఘటన మండల పరిధిలోని స్టేషన్ ధారూర్ గ్రామ శివారులో ఆదివారం చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని దోర్నాల-స్టేషన్ ధారూర్ గ్రామాల మధ్య ఉన్న మెథడిస్ట్ క్రిస్టియన్ చర్చ్ కు దైవదర్శనాల కోసం వచ్చి అందులో భాగంగా స్నానం కోసమని వెళ్లి పక్కనే ఉన్న కాగ్నా నది నీటిలోకి రాహుల్ (20) అనే యువకుడు దిగి గల్లంతయ్యాడు. కాగ్న నది నీటిలో మునిగిన రాహుల్ ఎంతసేపటికి బయటకు రాకపోవడంతో ఆయన వెంట వచ్చిన బంధువులకు అ ఎమానం వచ్చి వెతకగా ఆయన ఆచూకీ లభించకపోవడంతో వెంటనే 100 డయల్ కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. నీటిలో గల్లంతయిన రాహుల్ జహీరాబాద్ పట్టణానికి చెందిన ఒక టెంట్ హౌస్ లో లేబర్ పనులు చేస్తూ జీవనాన్ని కొనసాగించేవాడు. సమాచారం అందుకున్న అగ్నిమాపక, పోలీసు శాఖ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. అచూకీ లభించకపోవడం, గజ ఈతగాళ్ల ం రంగంలోకి దింపారు. అయినా ఫలితం లేకపోవడంతో మరుసటి రోజు గాలింపు చర్యలను కొనసాగిస్తా మని అధికారులు వెల్లడించారు.



అవార్డును అందుకుంటున్న నడికుడ రఘునాథ్ యాదవ్

## రఘునాథ్ యాదవ్‌కు అంతర్జాతీయ సేవారత్న అవార్డు

**షాద్‌నగర్, డిసెంబరు 15 ప్రభాతవార్త :** ఢిల్లీలో అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కార్యక్రమంలో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ చేతుల మీదుగా అంతర్జాతీయ సేవారత్న అవార్డును రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌కు చెందిన నడికుడ రఘునాథ్ యాదవ్ అందుకున్నారు. ప్రతి రాష్ట్రం నుండి కేవలం ఒక్కరిని మాత్రమే ఈ అవార్డుకు ఎంపిక చేస్తారని, ఈ సంవత్సరం తెలంగాణ రాష్ట్రం నుండి అఖిలభారత యాదవ మహాసభ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి నడికుడ రఘునాథ్ యాదవ్ సేవలను గుర్తించి బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఎ గౌతమ్, ఢిల్లీ రాష్ట్ర అధ్యక్షుడు మన్వీర్ సింగ్ ఆధ్వర్యంలో ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహుజనులకు నిరంతరం సేవలందిస్తూ, నిరుపేదలకు, పేద విద్యార్థినీ విద్యార్థులకు తనవంతు సహకారం అందిస్తూ, స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరికి ఆదర్శవంతంగా నిలుస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని అన్నారు. ఆయన సేవలు మున్ముందు మరింతంగా విస్తరింపజేయాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ సేవారత్న అవార్డు గ్రహీత నడికుడ రఘునాథ్ యాదవ్ మాట్లాడుతూ సమాజంలో ఎంతో మంది ఎన్నో రకాలుగా ఇబ్బందులకు గురవుతున్నారని, వారికి తనవంతుగా సహకారం అందిస్తానని, తన సేవలను గుర్తించి అంతర్జాతీయ అవార్డు రావడం సంతోషంగా ఉందని, మున్ముందు మరిన్ని సామాజిక కార్యక్రమాలు చేస్తానని తెలిపారు.

# టెంట్ హౌజ్ గోదాంలో అగ్నిప్రమాదం

**ఉప్పరిపల్లి గ్రామ పరిధిలో ఘటన**

**సిబ్బంది అప్రమత్తతతో తప్పిన ప్రాణనష్టం**

**టెంట్ హౌజ్ మ్యాట్‌లు,సామాగ్రి దగ్ధం.. స్వల్ప ఆస్థినష్టం**



ఆర్‌కె టెంట్ హౌజ్ గోదాంలో అగ్నిప్రమాదం సంబవించతో మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

**శామీర్‌పేట, డిసెంబరు 15, ప్రభాతవార్త**

ఉప్పరిపల్లి గ్రామ పరిధిలో బయట ఉన్న శ్రీపెద్దమ్మ ఆలయం సమీపంలో ఆర్‌కె టెంట్ హౌజ్ గోదాంలో ఆదివారం ఉదయం అగ్నిప్రమాదం సంభవించింది. దీనిలో ఉన్న కొందరు సిబ్బంది గోదాంలో మంటలు ఏర్పడినట్లు గుర్తించి పరుగులు తీసి ప్రాణాలు కాపాడు కోవటంతో ప్రాణనష్టం జరగలేదు. కొంత మేరకు టెంట్‌హౌజ్ వస్తువులు, మ్యాట్స్ ముందుగా తగిలిపోయి మంటలు ఏర్పడటంతో అందులో ఉన్న సిబ్బంది అప్రమత్తమై వెంటనే బయటకు వెళ్లి సంబంధితులకు, పోలీసులకు, అగ్నిమాపకం సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. ముందుగా లేబర్ ఉండే గది లో మంటలు ఏర్పడి ఆ తరువాత గోదాంలోకి మంట లు చేరి కార్పెట్స్ అంటుకుని మంటలు పెరిగినట్లు తెలి పారు. లేబర్ గదిలో ఎవరు లేకపోవటం, గోదాంలో ఉన్న సిబ్బంది అప్రమత్తతతో ప్రాణనష్టం ఏమి జరగ లేదని అన్నారు. శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీ పరిధిలోని ఉప్పరిపల్లి గ్రామ సమీపంలో ఉన్న ఆర్‌కె టెంట్ హౌజ్ గోదాం చాలా పెద్దది ఉంది. స్థానికుల, పోలీసుల, సంబంధితుల కథనం ప్రకారం ఆదివారం ఉదయం ఆర్‌కె టెంట్‌హౌజ్ గోదాంలో ప్రమాదవశాత్తు మంటలు ఏర్పడినట్లు, ఆ మంటలు చెలరేగటంతో గోదాంలో ఉన్న కొందరు సిబ్బంది అప్రమత్తమై బయటకు వెళ్లటం జరిగింది. వెంటనే అగ్ని మాపకం అధికారులకు, పోలీసులకు, సంబంధితులకు సమాచారం అందించినట్లు తెలిపారు. మంటలు ఏర్పడినట్లు గమనించి వెంటనే బయటకు వచ్చి కొందరు ప్రాణాలు కాపాడుకోవటంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని అన్నారు. అయితే టెంట్‌హౌజ్‌కు సంబంధించి మెటీరియల్ మ్యాట్స్ ముందుగా తగిలి మంటలు వచ్చినట్లు ఆ తరువాత టెంట్‌హౌజ్ సామాగ్రి కొంత మేరకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. అగ్ని మాపక సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మూడు అగ్నిమాపక వాహనాలు చేరుకుని సిబ్బంది మంటలను నీటితో ఆర్పించేశారు. ఈ అగ్నిప్రమాదం షార్ట్ సర్క్యూట్‌తోనే మరే ఇతర వాటితోనా అనేది అనుమానస్పదంగ మారిందని స్థానికులు పలువురు భావిస్తున్నారు. అగ్నిమాపక అధికారులు,సిబ్బంది



దగ్ధమైన వాటిని జెసిబిలతో తీస్తున్న దృశ్యం

స్పందించి చేరుకుని మంటలను ఆర్పివేయటంతో పెద్దగా ఆస్థినష్టం ఏర్పడకుండ అరికట్టినట్లు, ఈ గోదాంలో సాదారణంగ ఎప్పటికీ పెద్ద ఎత్తున టెంట్‌హౌజ్ సామాగ్రి ఉంటుందని, ఎక్కడైనా జరిగే భారీ బహిరంగ సభలకు, సమావేశాలకు ఈ గోదాం నుంచే టెంట్‌హౌజ్ సామాగ్రిని ఎక్కువగా తరలించటం జరుగుతుందని సమాచారం. అయితే కొందరు సిబ్బంది అప్రమత్తం కావటం వల్ల భారీ నష్టం జరగలేదని, కొంత మేరకు మాత్రం సుమారు మూడు లక్షల రూపాయల వరకు ఆస్థినష్టం జరిగినట్లు భావిస్తున్నట్లు తెలిపారు.

ఈ సంఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవటంతో అందరు ఊపిరిపీల్చుకున్నారు. గోదాంలో అగ్నిప్రమాదం సంభవించటంతో ఉప్పరిపల్లి గ్రామ చివరలో ఉన్నందున పరిసర ప్రాంతం అంత దట్టమైన పొగలు ఏర్పడి భయభ్రాంతులకు గురయ్యారు. గోదాంలో ఏర్పడిన మంటలను అగ్నిమాపక వాహనాలు మూడు చేరుకుని మంటలు ఆర్పటంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. శామీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పకడ్బందీగా గ్రూప్ 2 పరీక్షలు



పరీక్ష కేంద్రాన్ని సందర్శిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

**పరిగి డిసెంబర్ 15 ప్రభాతవార్త :** పరిగి పట్టణంలో జరిగిన గ్రూప్ 2 పరీక్షల నిర్వహణలో భాగంగా వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మండల కేంద్రంలోని విజ్ఞాన్ జూనియర్ కళాశాల, పల్లవి డిగ్రీ కళాశాలలోని పరీక్ష కేంద్రాలను సందర్శించారు.. సందర్భంగా అభ్యర్థుల హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రాల్లోని మౌలిక సదుపాయాలతో పాటు, వైద్య సదుపాయాలను కలెక్టర్ పరిశీలించారు.

## మొదటి రోజు గ్రూప్-2 పరీక్ష ప్రశాంతం



వికారాబాద్ పట్టణంలోని ఎస్‌ఏపీ కళాశాలలోని పరీక్ష కేంద్రానికి వస్తున్న అభ్యర్థులు

**వికారాబాద్, డిసెంబర్ 15, ప్రభాతవార్త:** గ్రూప్-2 పరీక్ష మొదటి రోజు ఆదివారం ప్రశాంతంగా జరిగింది. జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాల వద్ద గట్టి బందోబస్తును పోలీసు శాఖ నిర్వహించారు. గ్రూప్-2 పరీక్ష ఉదయం, మధ్యాహ్నం నిర్వహించారు. పరీక్ష నేపథ్యంలో పరీక్ష కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్‌ను అమలు పరిచారు. జిరాక్స్ సెంటర్లను సైతం మూసి వేశారు. ఈ పరీక్షకు 7,213 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా, 3,825 మంది హాజరు కాగా, 3,388 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. మొదటి రోజు 53 శాతం మేరకు అభ్యర్థులు పరీక్షకు హాజరైనట్లు సంబంధిత అధికారులు తెలిపారు. జిల్లాలోని పరిగి పరీక్ష కేంద్రాన్ని జిల్లా ఎస్పీ కె.నారాయణరెడ్డి సందర్శించి పరిశీలించారు.

### ఇబ్రహీంపట్నంలో..

**ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 15, ప్రభాతవార్త :** ఇబ్రహీంపట్నం, ఆదిభట్ల పోలీస్ స్టేషన్ల పరిధిలో మొదటిరోజు గ్రూప్ 2 పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి. సమయానికి గంటముందే అభ్యర్థులు కేంద్రాలకు వచ్చారు. హాల్‌టిక్కెట్, గుర్తింపు కార్డు పరిశీలన, తనిఖీల తర్వాత అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద ఇలాంటి వాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు 144 సెక్షన్ విధించారు. ఇబ్రహీంపట్నం, ఆదిభట్ల పోలీస్ స్టేషన్లో పరిధిలో 24 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా పరీక్ష కేంద్రాలలో 16,584 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా ..7444 (44.8 )మంది అభ్యర్థులు హాజరయ్యారు. 9140 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కాలేదు. నిబంధన మేరకు పరీక్షా కేంద్రంలోనికి ఎలక్ట్రానిక్ పరికరాలు, డబ్బులు, పర్సులు వంటి తదితర వస్తువులను అనుమతించలేదు. పలు పరీక్ష కేంద్రాల వద్ద అభ్యర్థులు తమ వస్తువులు భద్రపరుచుకునేందుకు ఏర్పాట్లు చేశారు.



శ్రీఇందు కాలేజీలో పరీక్ష రాసి బయటకు వస్తున్న అభ్యర్థులు

# కార్పొరేట్ వసతులపై చర్యలేవీ?

**నాసిరకపు భోజనం - కలుషిత నీటి సరఫరా**

**రూ.లక్షల్లో ఫీజుల వసూలు**

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

ప్రభుత్వ వసతి గృహాల్లో కలుషిత ఆహారంపై చర్యలు తీసుకుంటున్న యంత్రాంగం కార్పొరేట్ వసతులపై దృష్టి సారించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ప్రైవేట్ కార్పొరేట్ రెసిడెన్షియల్, ఇంటర్, పలు ఇంజనీరింగ్ కాలేజీల హాస్టళ్లలో నాసిరకపు భోజనమే వడ్డిస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. రాజధాని చుట్టూ పుట్టగొడుగుల్లా వెలసిన విద్యాసంస్థలలో పలు యాజమాన్యాలు విద్యార్థుల వసతులపై దృష్టి సారించడం లేదని తెలుస్తున్నది. ప్రతియేటా అనేక సంఘటనలు వెలుగు చూస్తున్నా అధికార యంత్రాంగం అటు వైపు సందర్శించిన దాఖలాలు చాలా తక్కువేనని అంటున్నారు. కార్పొరేట్ రెసిడెన్షియల్ పాఠశాల స్థాయి విద్యార్థులకు యేటా రూ.2 లక్షల పైమాటే ఫీజులు వసూలు చేస్తున్నారు. పేరొందిన సంస్థలలో ఆ ఫీజు మరింత ఎక్కువగా ఉంటుంది. స్కూలు ఒకచోట, హాస్టల్ మరోచోట పెట్టి యేటా కోట్ల రూపాయలను వసూలు చేస్తున్న యాజమాన్యాల గురించి పెద్దగా పట్టించుకోవడం లేదు. జైలు కంటే అధ్వాన్నంగా ఉండే ఇరుకు గదులలో విద్యార్థులు చదువు అభ్యసిస్తున్నారు. నీట్, జేఈఈ టార్గెట్‌తో కోచింగ్‌లు ఇస్తూ విద్యార్థులను ఆట పాటలకు దూరం చేస్తున్నారు. ఇలా నిర్బంధ విద్యను అందిస్తున్న కార్పొరేట్ సంస్థలు భోజన వసతుల కల్పనలో నాణ్యతను పాటించడం లేదని తెలుస్తున్నది. అన్నం, కూరలు, పప్పు, మాంసం అందిస్తున్నా చాలాచోట్ల నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. కలుషితమైన నీరు సేవించి తరచూ విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారు. ఇలాంటి సందర్భాలలో తల్లిండ్రులకు సమాచారం ఇచ్చి గుట్టు చప్పుడు కాకుండా ఇంటికి తరలిస్తున్నారు. ఇంటర్ కాలేజీల్లో కూడా దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది. విద్యార్థులు అస్వస్థతకు గురైతే అందుబాటులో ప్రాథమిక వైద్యం అందించడం లేదు. పలు ఇంజనీరింగ్ కాలేజీలకు అనుబంధంగా హాస్టళ్లు నిర్వహిస్తున్నా అక్కడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. అధ్వాన్నంగా ఉండే వసతులకు లక్షల రూపాయల ఫీజులను బలవంతంగా వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ హాస్టళ్లలో వసతులను ప్రశ్నించే తల్లిదండ్రులు కార్పొరేట్ స్థాయికి చేరుకోగానే మౌనం వహిస్తున్నారు. యాజమాన్యాలు కక్షసాధింపు దిశగా అడుగులు వేస్తే తమ పిల్లల కెరీర్‌పై ఎలాంటి ప్రభావం చూపుతాయోనని భయపడుతున్నారు. పలుమార్లు దాడులు జరిగిన సంఘటనలు వెలుగు చూశాయి. విద్యార్థి సంఘాల నాయకులు కూడా కార్పొరేట్ సంస్థల్లో విద్యార్థుల సమస్యలను తెలుసుకునేందుకు వెళ్లడం లేదు. ఒకవేళ యాజమాన్యాలను నిలదీస్తే రాజకీయ పలుకుబడితో కేసులు పెడతారనే భయం వారిని వెంటాడుతోంది. కార్పొరేట్ విద్యాసంస్థలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ప్రత్యేకంగా అధికారులను నియమించి తరచూ నాణ్యతను పరిశీలించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అంటున్నారు. ఉదయం అల్పాహారం మొదలుకుని డిన్నర్ వరకు విద్యార్థులకు నాణ్యతయుతమైన భోజన వసతులు కల్పించేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. చాలా వరకు కార్పొరేట్ విద్యాసంస్థల వెనక బడా నేతల అండదండలు ఉన్నందున చర్యలు తీసుకునేందుకు వెనకంజ వేస్తున్నారని ఆరోపణలు కూడా వస్తున్నాయి. ప్రభుత్వ వసతి గృహాల్లో నిన్నటి నుంచి అమలు చేస్తున్న కామన్ డైట్‌ను కార్పొరేట్‌లో కూడా అందేలా చర్యలు చేపట్టాలని అంటున్నారు.

## కీచక ఉపాధ్యాయుడు సస్పెండ్

**ధారూరు, డిసెంబర్ 15, ప్రభాతవార్త:** పాఠశాలలో విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన కీచక ఉపాధ్యాయుడును డీఈఓ రేణుకాదేవి సస్పెండ్ చేశారు. మండల పరిధిలోని స్టేషన్ ధారూర్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో పలువురు విద్యార్థి నులతో తెలుగు ఉపాధ్యాయుడు గొల్ల కిష్టయ్య అసభ్యంగా ప్రవర్తించారనే ఆరోపణలు వచ్చాయి. దీనిపై తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు. అనంతరం ఉపాధ్యాయుడిని డీఈఓ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా కిష్టయ్యపై ఇప్పటికే పోలీసులు పోక్సో కేసు నమోదు చేయగా, నిందితుడు పరారీలో ఉన్నారు.

## యువకులు క్రీడల పట్ల ఆసక్తి చూపాలి : డిఎస్పి



క్రీడాకారులతో పరిగి డిఎస్పి శ్రీనివాస్

**పరిగి డిసెంబర్ 15 ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలోని స్టేడియంలో ఎన్.ఎన్.ఆర్ క్రికెట్ టోర్నమెంట్ ను పరిగి డిఎస్పి శ్రీనివాస్ టాస్ వేసి ప్రారంభించారు.. ఈ సందర్భంగా డిఎస్పి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు, యువకులు, క్రీడలలో రాణించాలని, యువత క్రీడల పట్ల ఆసక్తి చూపాలని అన్నారు.. ప్రస్తుత కాలంలో విద్యార్థులు, యువత శారీరిక క్రీడలపై ఆసక్తి చూపట్లేదని,, యువకులు శారీరకంగా మానసికంగా దృఢంగా ఉండాలంటే కచ్చితంగా ఏదైనా ఒక క్రీడలో రాణించాలని , క్రీడల ద్వారా ఆరోగ్యపరంగానూ ఎన్నో లాభాలు ఉన్నాయని, యువకులు శ్రద్ధ పెట్టాలని, ప్రతిరోజు వ్యాయామం, క్రీడలు తప్పనిసరిగా దినచర్యలో భాగం చేసుకోవాలని యువకులకు పిలుపునిచ్చారు.. ఆటలలో గెలుపోటములు సహజం, కాబట్టి ఇరు జట్లు గెలుపు కోసం ప్రయత్నం చేస్తాయని, ఇరు జట్టు తమ యొక్క ఉత్తమమైన ఆటను కనబరిచాలని, ఉత్తమమైన ఆటను కనబరిచిన జట్లు గెలుపొందడం జరుగుతుందని, ఉత్తమ ప్రతిభను కనబరిచేందుకు ప్రయత్నం చేయాలని క్రీడాకారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పెద్దిరాజు,సాయి,అనీల్,మానస్, బల్లాల, ఆసిఫ్,అంబేద్కర్ విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మంచనపల్లి శ్రీనివాస్,ఫేయాజ్,అరవింద్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## తాండూరులో ప్రశాంతంగా గ్రూప్ -2 పరీక్ష

**మొదటి రోజు 41శాతం హాజరు**



పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

**తాండూరు, డిసెంబరు 15, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా తాండూరులో గ్రూప్-2 పరీక్ష ప్రశాంతగా కొనసాగింది. మొదటి రోజు 41శాతం అభ్యర్థులు మాత్రమే పరీక్షకు వ్రాసినట్లు అధికారులు వెల్లడించారు. ఆదివారం గ్రూప్-2 పరీక్షను దృష్టిలో ఉంచుకొని తాండూరులో మొత్తం 11 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 8-30గంటల నుండి 9-30గంటల వరకు అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. 10-00గంటల నుండి 12-30గంటల వరకు పరీక్ష కొనసాగింది. మధ్యాహ్నం పరీక్షకు 1-30గంటల నుండి 2-30గంటల వరకు అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. 3-00గంటల నుండి 5-30గంటల వరకు పరీక్ష కొనసాగింది. పరీక్ష కేంద్రాలలోకి అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశించిన తరువాతే అనుమతించారు. తాండూరులో 11పరీక్ష కేంద్రాలలో ఉదయం 3168మంది అభ్యర్థులు హాజరు కావల్సి ఉండగా 1310మంది అభ్యర్థులు మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. 1858మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం కూడా 1300మంది అభ్యర్థులు మాత్రమే హాజరు కాగా.. 1868మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఉదయం నుండే పరీక్ష కేంద్రాలను తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, డిఎస్పీ బాలకృష్ణారెడ్డిలు పరిశీలించారు. పోలీసు శాఖ అద్వర్యంలో పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తును ఏర్పాటు చేశారు. ప్రతి కేంద్రం వద్ద 144సెక్షన్ పక్కాగా అమలు చేశారు. మొదటి రోజు తాండూరులో పరీక్ష ప్రశాతంగా కొనసాగింది.

## అంతర్జాతీయ పారా త్రూబాల్ పోటీల్లో చింటురెడ్డికి గోల్డ్‌మెడల్

**శామీర్‌పేట, డిసెంబరు 15, ప్రభాతవార్త**

అంతర్జాతీయ పారా త్రూబాల్ పోటీల్లో కేశవరం గ్రామానికి చెందిన గోనె చింటురెడ్డి (దివ్యాంగుడు) పాల్గొని విజేతగా నిలిచి గోల్డ్‌మెడల్‌ను సాధించటంతో మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బి.నర్సింలుయాదవ్ సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఆయనతో పాటు కేశవరం గ్రామ నాయకులు యు.బాల్‌రాంగౌడ్ పాల్గొని చింటురెడ్డిని సన్మానించారు. ఆదివారం మూడుచింతలపల్లి మండలంలోని కేశవరం గ్రామంలో క్రీడాకారుడు గోనె చింటురెడ్డిని అభినందిస్తూ హర్షం వ్యక్తం చేసి వారితో పాటు పలువురు సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సం దర్భంగ మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బి.నర్సింలుయాదవ్ మాట్లాడుతూ తన స్వంత గ్రామం కేశవరం గ్రామానికి చెందిన గోనె చింటురెడ్డి శారీరకంగ అంగవైకల్యం ఉన్నా తన మనో బలంతో ఎంతో కష్టపడి అంతర్జాతీయ పారా త్రూబాల్ పోటీల్లో పాల్గొని గోల్డ్‌మెడల్ సాధించటం సంతోషంగ ఉందని, గ్రామానికి, దేశానికి కూడ ఆదర్శకంగ నిలిచారని అన్నారు. ఇక ముందు కూడ పోటీల్లో పాల్గొని మరిన్ని విజయాలు పొందాలని, తన వంతు సహకారం ఉంటుందని చైర్మన్ బి.నర్సింలుయాదవ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు యు.బాల్‌రాంగౌడ్, మల్లేశ్‌యాదవ్, ఇంద్రసేనారెడ్డి, వెంకటేశ్, యూసుఫ్, బి.మల్లేశ్, రామస్వామి, కొమురయ్య,



గోల్డ్‌మెడల్ సాధించటంతో మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బి.నర్సింలుయాదవ్, గ్రామ నాయకులు యు.బాల్‌రాంగౌడ్,పలువురు ఆయన్ని సన్మానించిన దృశ్యం

నరేందర్, చిత్తారి, కృష్ణ, స్థానికులు,పలువురు యువకులు పాల్గొన్నారు.

## గ్రూపు-2 పరీక్షా కేంద్రాల పరిశీలన

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబరు 15, ప్రభాతవార్త**

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో గ్రూపు-2 పరీక్షలు ఆదివారం జరిగాయి. జిల్లా పరిధిలోని ఘట్‌కేసర్ మండల పరిధిలోని ఎదులాబాద్‌లోని ఏసి ఇంజనీరింగ్ కాలేజ్, మెగా ఇనిస్ట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్స్ కాలేజీల్లో నిర్వహిస్తున్న గ్రూపు-2పరీక్షా కేంద్రాలను మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ సందర్శించి తనిఖీ చేశారు. ఏర్పాట్ల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద సిసికెమెరాలు, గదులలో ఏర్పాట్లపై ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ సందర్శించగా పరీక్షా కేంద్రాల్లో ప్రిన్సిపల్స్, ఎక్జామ్స్ కంట్రోలర్స్, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగ జిల్లా పరిధిలోని ఉప్పల్ సమీపంలోని రామాంతాపూర్‌లోని మెగా మహిళ డిగ్రీ కాలేజ్, వాగ్దేవి డిగ్రీ కాలేజ్‌లలో గ్రూపు 2 పరీక్షల కేంద్రాలను మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సందర్శించి తనిఖీలు చేశారు. ఆదివారం జిల్లాలో పరీక్షలు ప్రశాంతంగ జరుగుతున్నట్లు తెలిపారు. పరీక్షల కేంద్రాల వద్ద సిసి కెమెరాలు, గదులలో ఏర్పాట్లు, సెంటర్‌ల సమీపంలో జిరాక్స్ సెంటర్ల మూసివేత పలు అంశాలపై ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు.



గ్రూపు-2పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ గౌతమ్ సందర్శించి పరిశీలించిన దృశ్యం

